క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బ్లెస్సీని అభినందిస్తున్న హెచ్ఎం

దండేపల్లి: నిర్మల్ జిల్లా గుండంపల్లిలో శుక్రవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో దండేపల్లి మండలం రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని బ్లెస్సీ ప్రతిభ కనబరిచింది. దీంతో ఆమె ఈనెల 28 గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటుందని హెచ్ఎం రాజు, పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆమెను హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

భీమారం: మండలంలోని భీమారం, దాంపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఎంపీడీవో మధుసూదన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభపద్ధతిలో బోధించాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న నాయకులు

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచి అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. ఆర్కే 7 గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ యాజమాన్యం దీనిపై నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తోందన్నారు. సింగరేణి యాజమాన్యంతో 2022లో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. నాయకులు రవీందర్, భరత్, శ్రీనివాస్, నర్సింగం, ఆదిత్య, దిలీప్, వెంకటేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న లయన్స్ సభ్యులు

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ స్వర్ణోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో 15 మంది క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. వృద్ధాశ్రమం ఆనంద నిలయంలో వృద్ధులకు చీరెలు, దోవతులు, గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. మాతాశిశు ఆస్పత్రిలో 200 మందికి అన్నదానం నిర్వహించారు. మంచిర్యాల అధ్యక్షుడు బాలమోహన్, ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరిత మేనేజర్‌కు ఎక్స్‌లెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న వీరేందర్

జన్నారం: జన్నారం మండలం హరిత రిసార్ట్ మేనేజర్ ఎస్.వీరేందర్‌కు ఎక్స్‌లెన్సీ అవార్డు లభించింది. టూరిజం శాఖ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఎండీ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ఆయనకు ప్రశంసపత్రంతోపాటు అవార్డు అందించారు. అనతికాలంలో హరిత రిసార్ట్‌కు వచ్చిన టూరిస్టులకు సేవలందించినందుకు గాను ఈ అవార్డు లభించింది. మండలానికి చెందిన పలువురు ఆయన్ను అభినందించారు.

సంత..చింత

- రోడ్డుపై వార, దినసంతల నిర్వహణ
- ఆదాయం ఉన్నా సౌకర్యాలు కరువు
- రాకపోకలకు అంతరాయం
- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇక్కట్లు



పొన్కల్ ప్రధాన రహదారిపై వారసంత

జన్నారం: మండల కేంద్రంలోని పొనకల్ పంచాయతీ పరిధిలో దశాబ్ద కాలంగా ప్రతీ మంగళవారం వార, దినసంతలను రహదారిపై నిర్వహిస్తున్నారు. వీటికి ఏటా వేలం ద్వారా లక్షల ఆదాయం సమకూరుతోంది. ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల ఆదాయం వస్తోంది. ఈ సంవత్సరం వారసంతకు వేలం ద్వారా రూ.6 లక్షల ఆదాయం ఉన్నా సౌకర్యాలు కరువయ్యాయి. సంతలో వివిధ వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో వస్తుంటారు. వారికి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

గత మూడేళ్ల క్రితం

గత మూడేళ్ల క్రితం వారసంత పటేల్ మైదానంలో జరిగేది. క్రమేనా మైదానంలో ఇళ్ల నిర్మాణం జరగడంతో ఇరుకుగా మారింది. తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రోడ్డున దుకాణాలు పెట్టి కొన్నినెలలుగా సంత నిర్వహించేవారు. ఉన్నతాధికారులు వస్తూ వెళ్తుండగా ఇబ్బందులు ఏర్పడడంతో సంత నిర్వహణ బంద్ చేశారు. ధర్మారం చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ప్రధాన రహదారిపై గత రెండేళ్లుగా సంత నిర్వహణ కొనసాగుతోంది. దీని కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇరుకురోడ్డుపై ట్రాఫిక్‌జామ్ ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేవారు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. వార, దినసంతల కోసం అధికారులు జన్నారం మార్కెట్‌యార్డులో గల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోవాలి



వారసంత రహదారిపై నిర్వహిస్తున్నారు. షాపుల ఎదుట కూరగాయలు విక్రయిస్తున్నారు. బైక్‌లు, ఇతర వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ జామ్ అవతుంది. అధికారులు పట్టించుకోవాలి.

– శ్రీనివాస్, దుకాణదారు

స్థలం కేటాయించాలి



పొనకల్ వారసంత రోడ్డుపైనే పెడుతున్నారు. ఏళ్లుగా ఆదాయం గ్రామ పంచాయతీకి వస్తుంది. వాహనాదారులకు ఇబ్బంది లేకుండా అధికారులు వారసంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలి.

– సి.భరత్‌కుమార్, పొనకల్ వాసి

ఉన్నతాధికారుల దృష్టికి..

పొనకల్ వారసంత నిర్వహణకు ప్రత్యేక స్థలం లేకనే రోడ్డుపై నిర్వహణ జరుగుతుంది. గతంలో పాలకవర్గంలో ప్రత్యేక స్థలం కేటాయింపుపై తీర్మానం చేసి అధికారులకు పంపాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– రాహుల్, ఈవో, పొనకల్

లేబర్ సైట్‌ను వెంటనే పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంపల్లి: అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి కార్మిక శాఖ అధికారులు వెంటనే లేబర్ సైట్‌ను పునరుద్ధరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూల ఆధ్వర్యంలో పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటితరంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని అన్నారు. అడ్డా కూలీలు అనేక ఇబ్బందులకు గురవుతున్నా, శ్రమదోపిడి పాలవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లేబర్ సైట్ పునరుద్ధరించకపోవడంతో కార్మికశాఖ పరంగా అందించే సౌకర్యాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. అర్హత ఉన్న కార్మికులు కొత్త కార్డులు పొందలేకపోతున్నారని అన్నారు. బెనిఫిట్స్‌కు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్ సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్, నాయకులు రమేశ్, సత్తయ్య, శంకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెంకటరాములు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచిర్యాల కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు హాజరు కాగా, వారికి ఆయుధాల పనితీరు గురించి కమాండెంట్ వెంకటరాములు వివరించారు. అసిస్టెంట్ కమాండెంట్లు నాగేశ్వర్‌రావు, కాళిదాస్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల కళాజాత

భీమారం: పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలపై పాటల రూపంలో ప్రదర్శించారు. అమరులైన పోలీసులకు ఎస్సై శ్వేత నివాళులర్పించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుపై ప్రచారం



లింగాపూర్‌లో ప్రచారపత్రాలతో నాయకులు

దండేపల్లి: మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి గెలిపించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి రవి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావెనవేని రవి, మల్యాల మల్లేశ్ కోరారు. మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఓటరు నమోదు పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ తణుకు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పాల మనోహర్, పాత రమేశ్, కర్నె నరేందర్, రామరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు ఉన్నతంగా చదవాలి



చెక్కు అందిస్తున్న జీఎం దేవేందర్

బెల్లంపల్లి: పేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని మందమర్రి ఏరియా జీఎం జి.దేవేందర్ అన్నారు. బెల్లంపల్లిలోని వనవాసీ కళ్యాణ పరిషత్‌లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంజీగోండు విద్యార్థి నిలయంలో చదువుతున్న అనాథ, పేద విద్యార్థుల కోసం జీఎం.. సీఎస్ఆర్ నిధులు రూ.3,34,460 లక్షల చెక్కును కోశాధికారి లక్ష్మణ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సింగరేణి యాజమాన్యం అండగా ఉంటుందన్నారు. ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సమన్వయకర్త ఎండీ ఆసిఫ్, రాంజీగోండు విద్యార్థి నిలయం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మందమర్రి తహసీల్దార్ సతీశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ. 8 వేలకోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రిషి, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భాస్కర్

పాతమంచిర్యాల: జిల్లాలోని మందమర్రిలో వచ్చే నెల 8, 9 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు ప్రజలు, మేధావులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఫైళ్ల అశయ్య, సంకే రవి, జిల్లా కార్యదర్శి దాసరి రాజేశ్వరి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుంపల రంజిత్, గోమాస అశోక్, దాగం రాజారాం, బోడెంకి చందు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహిళా ఉద్యోగులకు శిక్షణ

కాసిపేట: మహిళా ఉద్యోగులు ఎంచుకున్న విభాగంలో శిక్షణ ఇచ్చినట్లు మందమర్రి ఏరియా ఎస్ఓటూ జీఎం, కమిటీ సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్‌లో 16 డిజిగ్నేషన్‌లో ఉద్యోగాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కమిటీ సభ్యులు పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డాక్టర్ జయవాణి, కేకే గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ భూశంకరయ్య, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషా తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

భీమారం: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కాజిపల్లిలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్సై శ్వేత ప్రారంభించారు. అనంతరం 610 మందికి వైద్యసిబ్బంది షుగర్, బీపీ, రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మధుసూదన్, కరీంనగర్ వస్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు

ఆయుర్వేద వైద్య శిబిరం

నస్పూర్: పట్టణ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేదిక్ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ పద్మజ, సిబ్బంది రవీందర్, ఎండీ ముజాఫర్, సీహెచ్ పుష్పాంజలి, ఏ.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'రఘునాథరావుపై వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోం'

లక్సెట్టిపేట: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావుపై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోని బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో పేద ప్రజలకు సేవ చేస్తున్న రఘునాథరావుపై కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిగా మాట్లాడడం సరికాదన్నారు. నాయకులు కిషన్, లక్ష్మణ్, ప్రభాకర్, హేమంత్‌రెడ్డి, సతీశ్, వెంకటేశ్, గంగన్న, రవి పాల్గొన్నారు.

పీఏసీఎస్ నిధుల వినియోగంలో అవకతవకలు

- తీర్మానాలు లేకుండా నిధులు సొంతానికి వాడుకున్న చైర్మన్
- వైస్ చైర్మన్ ఫిర్యాదుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణ



విచారణ చేపడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికిశోర్

జైపూర్: ఉమ్మడి జైపూర్ మండల ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) నిధుల వినియోగంలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. సభ్యుల తీర్మానాలు లేకుండానే నిధులను సంస్థ చైర్మన్ గుండు తిరుపతి తన సొంత అవసరాలకు వాడుకున్నారని వైస్ చైర్మన్ సంతోషం చంద్రశేఖర్ ఈనెల 19న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘం కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికిశోర్ శుక్రవారం విచారణ చేపట్టారు. 2022లో కార్యాలయ భవనం మరమ్మతు పేరిట రూ.4.50 లక్షలను తీసుకుని పనులు చేపట్టకుండానే సొంత అవసరాలను వాడుకున్నారని, అందులో రూ.80 వేలు జమ చేయకపోవడంతో గతంలో ఐదుసార్లు నోటీసులు ఇచ్చామని తెలిపారు. మళ్లీ ఈ ఏడాది మరమ్మతు పేరిట సంస్థ సభ్యులతో తీర్మానం చేయించారన్నారు. పెట్టుబడి లేకుండానే సంస్థకు చెందిన 4,500 బస్తాల ఎరువులను గతేడాది తన బంధువుల షాపునకు అప్పగించి ఆర్థికంగా లబ్ధిపొందినట్లుగా వైస్ చైర్మన్ పేర్కొన్నారు. వీటితోపాటు 2021లో కార్యాలయ అవసరాల కోసం రూ.29 వేలు వస్తువుల కొనుగోలు చేసి అవి ఉపయోగంలో ఉన్నప్పటికీ గతేడాది మళ్లీ రూ.50 వేలతో వస్తువులు కొనుగోలు చేసినట్లుగా బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు సీజన్‌లో వాహనాల పేరిట రూ.27వేలు పొందారని ఫిర్యాదు చేశారు. కాగా, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణకు వస్తున్నట్లుగా తెలిసి కొన్ని వస్తువులను ఉదయాన్నే కార్యాలయానికి తరలించారని చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందించనున్నట్లు రవికిశోర్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మొండయ్య

జన్నారం: సైబర్ నేరాలపట్ల రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఐఐఎస్ఎస్‌సీసీవోఎన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సాయిండ్ల మొండయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వయో వృద్ధుల అసోసియేషన్ కార్యాలయంలో సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల వల్ల అనేక మంది నష్టపోతున్నారని, వయోవృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా వయో వృద్ధుల పోషణ నిబంధనల గురించి వివరించారు. సమావేశంలో హెల్ప్ ఏజ్ ఇండియా స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంకుమార్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గోపి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ దేవయ్య, గౌరవ అధ్యక్షుడు కస్తూరి నాగేశ్వర్, సభ్యులు రాజయ్య, మురళీ, తారచంద్, భాస్కర్, లచ్చన్న, పుల్లయ్య, రాజం, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో ముందస్తు దీపావళి



వృద్ధుడికి దుస్తులు అందిస్తున్న సభ్యులు

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ శ్రీరాంపూర్ సాయిదృష్టి అంధుల పాఠశాల వృద్ధుల ఆశ్రమంలో మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తరంగిణి సభ్యులు వృద్ధులకు దుస్తులు అందించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం టపాసులు కాల్చారు. అధ్యక్షురాలు మంజుల కృష్ణారావు, ఉపాధ్యక్షురాలు లీల, ట్రెజరర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఈఎంటీగా షహబాజ్



అవార్డు అందుకుంటున్న షహబాజ్

చెన్నూర్: చెన్నూర్ 108 అంబులెన్స్ సర్వీసులో ఈఎంటీగా పనిచేస్తున్న షహబాజ్ జిల్లా ఉత్తమ ఈఎంటీగా ఎంపికయ్యాడు. మంచిర్యాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి సామ్రాట్, ఆసిఫాబాద్ జిల్లా కార్యనిర్వహణ అధికారి సంపత్, సతీశ్, రాష్ట్రస్థాయి అధికారి గజేందర్ ఆయనకు అవార్డు అందించారు. 108 అంబులెన్స్ సర్వీస్‌లో ప్రీ హాస్పిటల్ కేర్ సేవలందించినందుకుగాను షహబాజ్‌కు అవార్డు లభించింది.

ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో శుక్రవారం అండర్–19 బాలుర ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ సెక్రెటరీ బాబురావు తెలిపారు. పీడీ రాజయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కోచ్ రవికుమార్, పీఈటీ సురేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని కనకదుర్గాకాలనీకి చెందిన హర్షవర్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబానికి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి రూ.18వేల నగదును శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు తిరుపతి, మహేందర్, తూముల సురేశ్, సతీశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

వేమనపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధిహామీ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలని, కొత్త పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులు అప్‌డేట్ చేయాలని, పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీవో సత్యప్రసాద్, సీఎల్ఆర్‌సీ సురేశ్ గౌడ్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని టౌన్–3 పరిధిలోని రాజీవ్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ వేణుగోపాల్, ఏఈ నర్సయ్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రాజీవ్‌నగర్, తెలంగాణనగర్, గోపాల్‌వాడ, ఏ కాబిన్, వేముల బస్తీ, హమాలీవాడ, సూర్యనగర్, తిలక్‌నగర్, తోళ్లవాగు, రాజరాజేశ్వర కాలనీ, శ్రీశ్రీనగర్, తిరుమలగిరికాలనీ, గణేశ్‌నగర్, వినాయకనగర్, చున్నంబట్టివాడ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ఆయిల్‌పాం సాగు పద్ధతులపై అవగాహన

కాసిపేట: బెల్లంపల్లిలోని కన్నాల రైతు వేదికలో శనివారం ఆయిల్‌పాం సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.